సాక్షి కర్నూలు

మంగళవారం । 23 । జూలై । 2024



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని పురాతన మండపంలో భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు అర్చకులు సహస్రదీపార్చన సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



కోడెదూడ బహూకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన గోసంరక్షణ శాలకు బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన తులసీ ఇంద్ర ఒంగోలు జాతి కోడెదూడను సోమవారం బహూకరించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,630
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,01,99
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:12,542

న్యూస్‌రీల్

31 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



నందవరం బీసీ కాలనీలో డ్రైన్లను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కర్నూలు(అర్బన్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణకు పక్కాగా ఫాగింగ్ చేయడం, నీరు కలుషితం కాకుండా ట్యాంకులను శుభ్రపరచడంపై క్షేత్ర స్థాయిలోని అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ నెల 19, 20వ తేదిల్లో 88 గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ప్రారంభించామన్నారు. మిగిలిన అన్ని గ్రామాల్లో ఈ పనులను ముమ్మరం చేస్తామన్నారు. జిల్లా, డివిజినల్, మండల, గ్రామ స్థాయిల్లో పర్యవేక్షణ చేపడతామన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంధ్ర సరిహద్దుకు ఎల్లెల్సీ నీరు

- ప్రత్యేక పూజలు చేసిన టీబీ బోర్డు అధికారులు




ప్రత్యేక పూజలు చేస్తున్న సెక్షన్ ఆఫీసర్, సిబ్బంది

హొళగుంద: జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల వర ప్రదాయిని అయిన తుంగభద్ర నీరు సోమవారం తెల్లవారుజామున హొళగుంద సెక్షన్ 184 కి.మీకు చేరుకోగ ఎస్డీఓ, సెక్షన్ ఆఫీసర్లతో పాటు సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. కాలువకు నీరు రావడంతో గ్రామస్తులు కాలువకు తరలి వచ్చి పూజలు చేశారు. ప్రస్తుతం బసాపురం సెక్షన్‌లోని 230 కి.మీ వద్ద ఉన్న నీరు మంగళవారం సాయంత్రంలోపు బోర్డు సరిహద్దు 250 కి.మీ, హన్వాళ్ సెక్షన్‌ను దాటి ఆంధ్రలోకి ప్రవేశించనున్నాయి. కాలువలో గంటకు 100 క్యూసెక్కుల మేర నీటి పరిమాణం పెరుగుతూ గంటకు రెండు కి.మీ మేర ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే హొళగుంద సెక్షన్‌లో దాదాపు 700 క్యూసెక్కుల నీటిమట్టానికి చేరుకుంది. కాగా దిగువ కాలువకు నీరు రావడంతో రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బోరుబావుల కింద వేసుకున్న నారుమళ్లకు డిమాండ్ పెరిగింది.

డెమో రైలు కడప వరకే..

నంద్యాల(సిటీ): నంద్యాల – రేణిగుంట వరకు ప్రయాణిస్తున్న కడప డెమో రైలు కడప వరకు మాత్రమే ప్రయాణిస్తున్నట్లు నంద్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ దొరబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 07284/07285 నెంబర్ డెమో రైలు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు నంద్యాల – కడప వరకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి నంద్యాలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'స్టాప్ డయేరియా'పై కేంద్ర బృందం పర్యటన



డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌తో చర్చిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహణపై కేంద్ర బృందం సోమవారం తనిఖీ చేసింది. బృంద సభ్యులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కన్సల్టెంట్లు డాక్టర్ విశాల్, డాక్టర్ విజయ్‌కుమార్ వెల్దుర్తి సీహెచ్‌సీ, ఉలిందకొండ పీహెచ్‌సీలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్ గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందులు, మాత్రల పంపిణీ, ప్రచార సామగ్రి వినియోగం గురించి తెలుసుకున్నారు. సాయంత్రం వారు డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వారి తనిఖీల గురించి వివరించారు. ఈనెల 1న ప్రారంభమై వచ్చే నెల 31 వరకు కొనసాగే స్టాప్ డయేరియా కార్యక్రమం జిల్లాలో ఎలా కొనసాగుతుందో పరిశీలిస్తున్నామన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత ఉధృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

'సూపర్ సిక్స్' బురిడీ

- మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టిన బాబు అండ్ కో
- పథకాలు, హామీల అమలు దాటవేతకే ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- పూర్తిస్థాయి బడ్జెట్‌తోనే నిధుల కేటాయింపులు
- తాజా పరిస్థితితో ఏడాది పాటు పథకాల అమలు లేనట్లే
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి బడ్జెట్‌లోనే హామీల అమలు
- మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమేరకు గళం విప్పుతారోనని ప్రజల ఎదురుచూపులు

హామీలు.. గాలిలో!

ఒకటి కాదు.. రెండు కాదు.. సూపర్ సిక్స్ పేరుతో కొన్ని.. మేనిఫెస్టోలో మరికొన్ని.. ఎన్నికల ప్రచారంలో ఇంకొన్ని.. గత ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేస్తుందో వాటన్నింటికీ మరింత అదనంగా నిధులు ఇస్తామని కూటమి నేతలు అలవికాని హామీలు గుప్పించారు. అధికారం దక్కింది. గద్దెనెక్కారు. అయితే మాటల్లో చెప్పిన హామీలు.. చేతల్లో అమలు చేసి చూపలేకపోతున్నారు. 'ఏరుదాటాక తెప్ప తగలేసినట్లు' హామీల ఊసెత్తడం లేదు. పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం చూస్తే పథకాల ప్రస్తావన, వాటికి నిధుల కేటాయింపు లేకుండా దాటేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టంగా తెలుస్తోంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

పింఛన్ల పెంపు సరే.. 50 ఏళ్ల వారికి పింఛన్ సంగతేంటి?

జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు 2,45,229 మందికి పింఛన్ వస్తోంది. రూ.3వేల పింఛన్ రూ.4వేలకు పెంచారు. దివ్యాంగులకు రూ.6వేలు చేశారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీనిపై చిత్తశుద్ధి ఉంటే పింఛన్ పెంపుతో పాటు 50 ఏళ్ల వారికీ ఇస్తామని ప్రకటించాలి. కానీ దాన్ని అమలు చేయడం లేదు.




ఖరీఫ్ మొదలైంది.. అన్నదాత సుఖీభవ ఎక్కడ?:

గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ మొదలవ్వగానే 'రైతుభరోసా' నిధులు ఖాతాల్లో జమ చేసేది. ఐదేళ్లలో 2,96,739 మందికి రూ.1,793కోట్లు ప్రభుత్వం జమ చేసింది. 'కూటమి' ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పేరుతో ఒక్కో రైతుకు రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఈ ఏడాది రూ.593.47కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాలి. ఖరీఫ్ ప్రారంభమైనా పథకం ప్రస్తావన లేదు. మరో నాలుగు నెలలు ఆ ఊసు లేనట్లే.

స్కూళ్లు మొదలైనా 'తల్లికి వందనం' లేదు

స్కూళ్లు మొదలవ్వగానే జూన్‌లో 'అమ్మ ఒడి' పేరుతో తల్లుల ఖాతాల్లో నగదు జమ అయ్యేది. ఏటా 2,47,785 మంది తల్లుల ఖాతాల్లో రూ.371.66కోట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసేది. అయితే జూన్ 13న పాఠశాలలు ప్రారంభమైతే ఇప్పటి వరకూ 'తల్లికి వందనం' అమలు చేయలేదు. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ రూ.15వేల చొప్పున హామీ ఇచ్చింది. కానీ తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తామని జీవో 29 జారీ చేసింది. దీంతో జిల్లాలో 2.47,785 తల్లులు తమ బిడ్డలను బడికి పంపి ఫీజులు, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నారు. ఓటాన్ అకౌంట్‌తో తల్లికి వందనం అమలు కూడా ఇప్పట్లో లేదని తేలిపోయింది.



నమ్మిన ప్రజలను నట్టేట ముంచడం అంటే ఇదే. ప్రజలను ప్రలోభపెట్టి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్న చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించే దిశగా అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి బడ్జెట్ కాకుండా, ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని చూస్తే బాబు మోసం బట్టబయలవుతోంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఏడాది పాటు ఖర్చులు చూపించాలి. అందులో తాను ఇచ్చిన పథకాల అమలు, వాటికి కేటాయింపులు చేయాలి. అయితే కూటమి ప్రభుత్వానికి పథకాల అమలుపై చిత్తశుద్ధి లేదని తాజా పరిస్థితులతో స్పష్టమవుతోంది. ఈ నాలుగు నెలల పాటు 'కూటమి' ఇచ్చిన 'సూపర్ సిక్స్'తో పాటు 'మేనిఫెస్టో హామీల' అమలు ఉండదని ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో తేలిపోయింది. పాలన మొదలై ఇప్పటికే 50 రోజులైంది. మరో నాలుగు నెలలు పథకాల ప్రస్తావన లేదు. దీంతో ఆర్నెల్లలో పింఛన్ల హామీని పాక్షికంగా అమలు చేయడం మినహా ఏ హామీని ప్రభుత్వం అమలు చేయదని తేలిపోయింది. జిల్లాలో ఐదుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఒకరు మంత్రి. వీరంతా జిల్లా అభివృద్ధికి అసెంబ్లీ లో పాటు పడాలని జిల్లా వాసులు కాంక్షిస్తున్నారు.

జిల్లా అభివృద్ధి సంగతేంటి 'బాబూ'

'సీమ'ను అభివృద్ధి చేయడంలో భాగంగా కర్నూలును 'న్యాయరాజధాని'గా చేస్తానని గత ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా జగన్నాథగట్టుపై 273 ఎకరాల్లో 'జ్యుడీషియల్ సిటీ' నిర్మించేందుకు భూమి కేటాయించింది. 150 ఎకరాల్లో నేషనల్ లా కాలేజీకి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. దీనికి రూ.వెయ్యికోట్ల నిధులు మంజూరయ్యాయి. అలాగే లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, ఏపీఈఆర్‌సీ, సీబీఐ కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. ఇందులో ఏపీఈఆర్‌సీకి ప్రభుత్వ భవనం కూడా నిర్మించారు. జిల్లా అభివృద్ధికి ఇవన్నీ దోహదం చేయనున్నాయి. అయితే ఇవన్నీ అమరావతికి మార్చబోతున్నారనే ప్రచారం జిల్లాలో నడుస్తోంది. అమరావతే రాజధాని అని చంద్రబాబు తేల్చిచెప్పడంతో హైకోర్టు, జ్యుడీషియల్ సిటీపై నీలినీడలు కమ్ముకున్నాయి. హైకోర్టు ఇక్కడే నిర్మించి, జ్యుడీషియల్ సిటీని పూర్తి చేయాలని, తద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందనేది ఇక్కడి ప్రజల ఆకాంక్ష. మరి దీనిపై అసెంబ్లీలో స్పష్టత ఇస్తారో? లేదో చూడాలి. జిల్లా ఎమ్మెల్యేలు ఈ విషయాల్లో ఏ మేరకు గళం వినిపిస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో తొలి బడ్జెట్‌లోనే హామీలన్నీ అమలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 2019 మే 30న ప్రమాణస్వీకారం చేశారు. జూలై 12న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రవేశపెట్టారు. తొలి బడ్జెట్‌లోనే మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల అమలు, వాటికి కేటాయింపులు చేశారు. జూన్ 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఇప్పుడు కేవలం ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టి పథకాలు, నిధుల ప్రస్తావన లేకుండా దాటవేస్తున్నారు. జగన్ మోహన్‌రెడ్డి తొలి బడ్జెట్‌లోనే హామీలన్నీ అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నప్పుడు చంద్రబాబు ఎందుకు అమలు చేయలేకపోతున్నారనే విషయమై ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంది.

2019 జూలై 12న అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించిన అమలు చేసిన పథకాలు ఇవే!:

- రైతులకు వడ్డీలేని రుణాలు
- పంటలబీమా సొమ్ము రైతులు కాకుండా ప్రభుత్వం చెల్లించడం
- రైతు భరోసా
- ఆత్మహత్యలు చేసుకున్న రైతులు, కౌలు రైతులకు రూ.7లక్షల పరిహారం
- అమ్మ ఒడి
- నాయి బ్రాహ్మణులకు ఏడాదికి రూ.10వేలు
- రజకులకు ఏడాదికి రూ.10వేలు
- ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు
- టైలర్లకు ఏడాదికి రూ.10వేలు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్
- ఇమామ్‌లకు రూ.10వేలు, మూజమ్‌లకు రూ.5వేలు వేతనాలు పెంపు
- వైఎస్సార్ కళ్యాణమస్తు ద్వారా బీసీలకు రూ.50వేలు,ఎస్సీ,ఎస్టీలకు రూ.లక్ష బహుమానం
- నామినేటెట్ పోస్టుల్లో 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, అందులో 50 శాతం మహిళలకు
- కాంట్రాక్టుల్లో కూడా రిజర్వేషన్లు, అందులో 50శాతం మహిళలకు కేటాయింపు.

జిల్లా అభివృద్ధి కోసం ఇచ్చిన కొన్ని హామీలు.. ప్రజల ఆకాంక్షలు:

- కర్నూలు నగరంలో మంచినీటి సమస్య ఉంది. నాలుగురోజులకు ఒకసారి నీరు వస్తోంది. అదనంగా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీన్ని మంత్రి భరత్ అసెంబ్లీలో ప్రస్తావించి ఆమోదముద్ర వేయిస్తారో? లేదో చూడాలి.
- కర్నూలులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో టీజీ భరత్ హామీ ఇచ్చారు.
- కర్నూలులో సుద్ధవాగు అన్యాక్రాంతమైంది. అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
- మంత్రాలయంలో అగసనూరులో బొమ్మలాపురం నుంచి తుంగభద్ర నది ఆనకట్టపై రాజోలి బండ డైవర్షన్ స్కీం నుంచి 4 టీఎంసీలతో కుడిగట్టు కాలువ నిర్మించి, 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు సాగునీరు అందే ఈ ప్రాజెక్టు పరిధిలో రూ.1,950కోట్లతో మూడు రిజర్వాయర్లు నిర్మించి ఐదేళ్లలో పూర్తి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.
- ఎమ్మిగనూరు చేనేతల కోసం టెక్స్‌టైల్ హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.
- ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టులో ప్రత్యేకంగా జింకల పార్కు, హాలహర్వి మండలం గూళ్యం గ్రామం వద్ద వేదవతి నదిపై రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.


పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టాలి



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కచ్చితంగా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలి. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సైతం పూర్తి స్థాయి బడ్జెట్‌నే ప్రవేశ పెడుతోంది. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం ఎంత వరకు సమంజసం. ప్రజా ప్రతినిధులు దీనిపై అసెంబ్లీలో మాట్లాడాలి. పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినప్పుడే కూటమి పార్టీ ఇచ్చిన హామీలు, ప్రకటించిన పథకాలకు నిధులు కేటాంచే అవకాశం ఉంటుంది.

– రోషన్ అలీ, విశ్రాంత తహసీల్దార్


ఓటాన్ బడ్జెట్ ఓ ఎత్తుగడ



రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెడుతుందంటే పథకాల అమలుకు సరిపడా నిధులు లేవని ఒప్పుకున్నట్లే అవుతుంది. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఈ నెలతో ముగుస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుకు సరిపడా వనరులు సమకూర్చుకొని ఫుల్ బడ్జెట్ లో కేటాయింపులు చూపించాలి. ఓట్ ఆన్ బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఒక ఎత్తుగడ. ఇది సరైంది కాదు.

– మన్సూర్ రహమాన్, విశ్రాంత ఆచార్యులు

శ్రీశైలంకు పెరుగుతున్న వరద



832.50 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాజెక్ట్‌లు ఆల్మట్టి, నారాయణపూర్, సుంకేసులను దాటుకొని జూరాల నుంచి శ్రీశైలంకు వరదనీరు భారీగా వస్తుంది. ఒక్క రోజులోనే 9.4090 టిఎంసీల నీరు వచ్చి చేరింది. దీంతో ఆదివారం సాయంత్రం నాటికి 822.50 అడుగులుగా ఉన్న నీటిమట్టం సోమవారం సాయంత్రం నాటికి 832.50 అడుగులకు చేరుకుంది. సోమవారం సాయంత్రం నాటికి జూరాలలో స్పిల్‌వే, విద్యుత్ ఉత్పాదన ద్వారా 1,74,717 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలంకు విడుదలవుతుంది. ప్రస్తుతం జలాశయంలో 52.1476 టిఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యాం పరిసర ప్రాంతాలలో 14 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

గురుకుల విద్యార్థిగా గర్వపడుతున్నా

- పూర్వ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



కలెక్టర్ రంజిత్‌బాషాకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: తన ఎదుగుదలలో గురుకుల పాఠశాల రుణం తీర్చుకోలేనిదని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు కర్నూలులో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా ఆగస్టు 11న సంయమ పేరిట పాఠశాలలో ప్రతిభా విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్‌ను కో రారు. అనంతరం ఆయన కొద్దిసేపు పూర్వ విద్యార్థుల తో ముచ్చటించారు.యోగ క్షేమాలు తెలుసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను చదువుకున్న రోజుల్లో పాఠశాలలో వసతులు సరిగా వుండేవికావని.. అప్పటి కీ, ఇప్పటికీ ఎంతో అభివృద్ధి చేశారని తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఢిల్లీకి రాజైనా, తల్లికి కొడుకే అన్నట్లు.. తాను ఈ రోజు ఇంత పెద్ద స్థాయిలో ఉన్నా గురుకుల పాఠశాల విద్యార్థినని చెప్పుకోవడం గర్వంగా ఉంటుందన్నారు. తనకు బంగారు భవిష్యతును ఇచ్చిన గురుకుల పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. పాఠశాలకు చెందిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని భరోసానిచ్చా రు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, పూర్వ విద్యార్థులు నాగసుబ్బరాయుడు, రఘు, జమ్మన్న, నాగరాజు, సలీమ్ బాషా, వరప్రసాద్, అస్లామ్, మధు, రాజశేఖర్, అమర్‌నాథ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన జనం
- ఎప్పటికప్పుడే పరిష్కరించాలంటూ అధికారుల కలెక్టర్ ఆదేశం
- ఒంటి గంటకే ముగించడంపై నిరసన తెలిపిన బాధితులు

వినతుల వెల్లువ



ప్రజా సమస్యల పరిష్కార వేదికను 1 గంటకే ఆపేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. వర్షం పడుతున్నా జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని సమస్యలు విన్నవించేందుకు బారులుతీరారు. ఉన్నతాధికారులకు వినతులు వచ్చి పరిష్కారం చేయాలని కోరారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను హెచ్చరించారు. సోవామరం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటరియంలో ప్రజల నుంచి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదన్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

వెనుదిరిగిన బాధితులు

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మధ్యాహ్నం 1 గంటకే ముగించడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి వినతులు ఇవ్వడానికి వచ్చిన బాధితులు కలిసి ఎలెక్టరేట్ ఎదుట కాసేపు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు.

వైఎస్సార్‌సీపీ ముద్ర వేస్తున్నారు



పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలను దౌర్జన్యంగా తొలగిస్తున్నారు. తాము ఏ పార్టీకి చెందని వారైనా వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి టీడీపీ నాయకులు దౌర్జన్యంగా తొలగిస్తున్నారని, ఐదేళ్ల నుంచి జీవనాధారంగా ఉన్న పనిని తొలగిస్తే తామెలా బతకాలని ఆయాలు జ్యోతి, రమాదేవి, సాలమ్మ, మహాదేవి, సుంకమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కలుగజేసుకొని తమను కొనసాగించాలని వారు కోరారు.

10 ఏళ్లుగా తిరుగుతున్నా



'నా పేరు గోరంట్ల. నాది గూడూరు మండలం చనుగొండ్ల గ్రామం. నాకు రెండు కాళ్లు లేవు. ఎక్కడికి వెళ్లాలన్నా దోక్కుంటూ వెళ్లాల్సిందే. బ్యాటరీ సైకిల్ కోసం పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ఐదుగురు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చా. కాళ్లు, చేతులు బాగున్న వారే బ్యాటరీ సైకిళ్లలో తిరుగుతున్నారు. నాకెందుకు ఇవ్వడం లేదోనని' ఆవేదన చెందాడు

జూలైలో 34 మి.మీ లోటు వర్షపాతం

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెలలో 34 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 90.7 మి.మీ కాగా తేలికపాటి వర్షాలే కురుస్తుండటంతో ఇప్పటి వరకు 56.4 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూన్ నెల మొదటి పక్షం వరకు వర్షాలు మురిపించినా ఆ తర్వాత ముఖం చాటేశాయి. దాదాపు 15 రోజులుగా ఆకాశం మేఘావృతం అవుతున్నా జల్లులు, తేలికపాటి వర్షం తప్ప భారీ వర్షం కురిసింది లేదు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 17 మండలాల్లో వానలు పడినా ఆలూరులో 6.2 మి.మీ, హాలహర్విలో 4.2, వెల్దుర్తిలో 4.2, కర్నూలులో 3.8, కర్నూలు అర్బన్‌లో 3.8, కల్లూరులో 2.6 మి.మీ వర్షపాతమే నమోదైంది. వర్షాలు ఇలాగే ఉంటే ఖరీఫ్ గట్టెక్కడం అనుమానమేనన్న అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

పేరు మార్చారు గానీ.. పైసా విదిల్చలేదు!

- చంద్రన్న బీమా కింద ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు
- సహజ మరణాలకు రూ.5 లక్షలు పరిహారం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ
- ప్రభుత్వం ఏర్పడి నెలన్నర అవుతున్నా అతీగతి లేని వైనం
- పరిహారం కోసం జిల్లాలో 463 కుటుంబాల ఎదురుచూపులు
- ఎన్నికల కోడ్ నాటికి క్లెయిమ్‌లన్నీ పరిష్కరించిన గత ప్రభుత్వం



టీడీపీ మేనిఫెస్టోలో చంద్రన్న బీమా పథకం గురించి స్పష్టంగా ఇచ్చిన హామీ

కర్నూలు(అగ్రికల్చర్): సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ధీమానిచ్చే బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రక్కన పెట్టింది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ఆ కుటుంబం వీధిన పడరాదనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వైఎస్సార్ బీమా కల్పించి ఊరటనిచ్చింది. గత ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రూపాయి ఖర్చు లేకుండా బీమా కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు భరోసా ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చింది. అయితే పేరు మార్చడం తప్ప కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఊరట లభించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలన్నర రోజులవుతున్నా ఒక్క కుటుంబానికి కూడా ధీమా లభించలేదు. 2014–15 నుంచి 2018–19 మధ్య టీడీపీ పాలనలో చంద్రన్న బీమా నమోదుచేసుకున్న వారు వందలాది మంది అసువులు బాసినప్పటికీ నాటి ప్రభుత్వం నుంచి లభించిన భరోసా నామ మాత్రమే. బీమా ఉన్న వారు మరణిస్తే వారి వారసులు పరిహారం పొందాలంటే ఏళ్ల గడిచేవి. దీంతో బాధిత కుటుంబాలకు భరోసా లభించక అనేక ఇబ్బందులు పడేవారు. ఈసారి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యింది. సూపర్–6 హామీలే గాకుండా ఇతరత్రా అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా అమలులో తీవ్ర జాప్యం చేస్తోంది. జిల్లాలో 6,38,828 రైస్‌కార్డులు ఉండగా 5,38,678 కుటుంబాలు చంద్రన్న బీమా కింద నమోదై ఉన్నాయి.

హామీ నెరవేరేదెప్పుడు !

2024 ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు తాము అధికారంలోకి రాగానే ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు రూ.10 లక్షలకు, సహజ మరణాలకు రూ.5 లక్షలకు బీమా సదుపాయం కల్పిస్తామని స్పష్టంగా హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులవుతున్నా హామీ అమలుపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ తీరును గమనిస్తే బీమాతో ధీమా కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుముఖంగా లేరనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తే జిల్లాలో వందలాది కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. అయితే హామీ అమలు ఎప్పుడనేదే ప్రశ్నార్థకంగా మారింది.

463 కుటుంబాలకు ధీమా ఇచ్చేదెప్పుడు..?

ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ప్రమాదవశాత్తు మరణించినట్లు 85 మంది వివరాలు రిజిస్టర్ అయ్యాయి. ప్రమాద మరణాలకు సంబంధించి చాలావరకు డాక్యుమెంట్లు అప్‌లోడ్ అయ్యాయి. సహజ మరణాలకు సంబంధించి 373 మంది వివరాలు రిజిస్టర్ అయ్యాయి. డాక్యుమెంటేషన్ కూడా జరుగుతోంది. మొత్తంగా 463 కుటుంబాలు చంద్రన్న బీమా కోసం ఎదురు చూస్తున్నాయి. బీమా పొందిన వారు ఏ విధంగా మరణించినా 24 గంటల్లో మట్టి ఖర్చు కోసం రూ.10 వేలు చెల్లిస్తారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కుటుంబ యజమాని మరణించినా మట్టి ఖర్చులు కూడా దక్కడం లేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 8 నెలల్లో రూ.10.90 కోట్ల పరిహారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023–24లో వైఎస్సార్ బీమా ద్వారా రూ.10.90 కోట్లు మరణించిన వారి కుటుంబాలకు చెల్లించింది. వైఎస్సార్ బీమా కింద నమోదైన కుటుంబాలకు రెండు రకాలుగా బీమా వర్తింపచేసింది. కుటుంబానికి ఆధారమైన 18–50 ఏళ్లలోపు పాలసీదారులు సాధారణంగా మరణిస్తే రూ.లక్ష పరిహారం లభిస్తుంది. ఈ పరిహారాన్ని ప్రభుత్వం బీమా కంపెనీలతో సంబంధం లేకుండా నేరుగా చెల్లించింది. 18–70 ఏళ్ల లోపు పాలసీదారులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం చొప్పున మార్చిలో ఎన్నికల కోడ్‌వచ్చే నాటికి డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసిన క్లెయిమ్‌లన్నింటినీ సెటిల్ చేసింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత క్లెయిమ్‌లు రిజిస్టర్ చేయడం, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం నిలిచిపోయాయి. వీటన్నింటినీ కూటమి ప్రభుత్వమే పరిష్కరించాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడి 45 రోజులవుతున్నా, ఒక్క క్లెయిమ్ కూడా సెటిల్ కాలేదు. పైపెచ్చు చంద్రన్న బీమా మార్గదర్శకాలే జారీ కాలేదు. దీన్ని బట్టి చూస్తే చంద్రన్న బీమాకు గ్రహణం పట్టినట్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వేగంగా పేరు మార్చినా.. ధీమా కల్పించడంలో నిర్లక్ష్యం !

చంద్రన్న బీమా పథకానికి పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందా.. తమ కుటుంబాల్లో వెలుగు లు ఎప్పుడు చోటు చేసుకుంటాయా అని వందలాది కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. మార్చి నెల 18వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ వచ్చింది. నాటి నుంచి అప్పుడు ఉన్న వైఎస్సార్ బీమా కింద రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం ఆగిపోయింది. జూన్ 12న నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యింది. వెంటనే వైఎస్సార్ బీమాను చంద్రన్న బీమాగా పేరు మార్చినప్పటికీ పథకం అమలులో వేగం లేకపోవడం గమనార్హం. ఈ నెల 8 నుంచి చంద్రన్న బీమా సైట్‌ను ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్ల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చింది. అయితే ఇంతవరకు ఎలాంటి విధి విధానాలు రాలేదు. ఇప్పటివరకు వైఎస్సార్ బీమా మార్గదర్శకాలే అమలులో ఉన్నా యి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5 లక్షలు పరిహారం వర్తింపజేసేలా ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు. దీన్ని బట్టి చూస్తే కుటుంబానికి ఆధారమైన వారు మరణించినప్పుడు వారికి ధీమా కల్పించడం సాధ్య అయ్యేలా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

20 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత

- విషగుళికల ప్రభావమే అంటున్న స్థానికులు


ఆళ్లగడ్డ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలు

ఆళ్లగడ్డ: వారంతా వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే పేదలు. సోమవారం మొక్కజొన్న పొలంలో పనులు చేస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. ఆళ్లగడ్డకు చెందిన రామక్రిష్ణారెడ్డికి చెందిన మొక్కజొన్న పంటలోకి కూలీ పనులకు సోమవారం 20 మంది వెళ్లారు. పొలంలో కలుపు తీసే పని చేస్తుండగా కూలీలు ఈశ్వరమ్మ, పద్మావతి, లక్ష్మీదేవి, నాగేశ్వరమ్మ, రామలింగమ్మ, ఉమాదేవి, సరస్వతి, లంగేశ్వరి, ఓబుళమ్మ, తిరుమలమ్మ, నారాయణమ్మ, తులశమ్మ, పార్వతమ్మలతో పాటు మరికొంతమంది ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బందిపడుతూ అస్వస్థతకు గురయ్యారు. అంతకుముందు పంటలో విషగుళికలు చల్లడంతో ఆ వాసన భరించలేక స్పృహతప్పి పడిపోయారు. అక్కడున్న రైతులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో 108 వాహనంలో స్థానిక వైద్యశాలకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. విష గుళికల ప్రభావంతో కూలీలు అస్వస్థతకు గురై ఉంటారని భావిస్తున్నారు.

క్లుప్తంగా

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- టీడీపీ నేత ఆధ్వర్యంలో పేకాట నిర్వహణ

కొలిమిగుండ్ల: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. టీడీపీ నాయకులే దగ్గరుండి పేకాట, మట్కా, నాటుసారా విక్రయాలు చేయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నందిపాడుకు చెందిన ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో తిమ్మనాయినపేట సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం మధ్యాహ్నం సీఐ గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడి చేశారు. ఆ సమయంలో పేకాటరాయుళ్లు భోజనం చేస్తున్నారు, పోలీసుల రాకను గమనించిన ఐదారుగురు పరారు కాగా మిగతా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నందిపాడు, తిమ్మనాయినపేట, కోటపాడు గ్రామాలతో పాటు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ప్రాంతాల నుంచి రోజు ఇక్కడికి పేకాట ఆడేందుకు వస్తుంటారు. పోలీసులు ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.12,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. అధికార పార్టీ నేత ఆధ్వర్యంలో పేకాట జరుగుతుండటంతో పట్టుబడిన వారి పేర్లను పోలీసులు గోప్యంగా ఉంచారు.

ఇటుక బట్టీల్లో సోదాలు

కర్నూలు (టౌన్): ఇటుక బట్టీలపై మైనింగ్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లోని ఎస్‌ఆర్‌ఐ, ఎస్‌ఆర్‌బీ, ఎస్ఎన్‌బీ, ఎన్ఎస్‌బీ, ఎస్‌బీఐ పేరుతో ఉన్న ఇటుక బట్టీలను సోమవారం ఆ శాఖ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఈ బట్టీలపై రూ.20 వేల చొప్పున ఐదుగురికి రూ.లక్ష జరిమానా విధించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక


అస్మితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆస్పరి: మండలంలోని నగరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుచున్న అస్మిత రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికై నట్లు పీడీ విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 20న కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలో 12 –14వ సంవత్సరాల బాలికల విభాగంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అస్మిత ప్రతిభ కనబరచి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆగస్టు రెండవ వారంలో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో అస్మిత పాల్గొంటుందని చెప్పారు. హెచ్ఎం రవికుమార్,ఉపాధ్యాయులుఅభినందించారు.

కళాశ్రీ అవార్డు ప్రదానం

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కళాకారుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య షాద్‌నగర్ సంస్కార భారతి వారి కళాశ్రీ అవార్డును అందుకున్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంస్కార భారతి వారు రెండు రోజుల పాటు షాద్‌నగర్‌లోని ఏవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బాలల నాటకోత్సవంలో నలుగురు ఉత్తమ కళా సేవకులకు అవార్డులను ప్రదానం చేశారు. సంస్కార భారతి అధ్యక్షుడు టీవీ రంగయ్య, బక్కని నరసింహులు, అంజయ్య యాదవ్, జబర్దస్త్ కళాకారులు మురళి, సుధాకర్, ఆర్‌సీఎం రాజు అవార్డును అందజేశారు.

లాడ్జీల్లో తనిఖీలు

మహానంది: లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానందిలోని ప్రైవేట్ లాడ్జీల్లో సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ లాడ్జీలకు వచ్చేవారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, ఐడీ ప్రూఫ్ చూసి గదులను ఇవ్వాలన్నారు. కొన్ని లాడ్జీల్లో అనధికారిక జంటలకు గదులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరికలు చేశారు.

ప్రజా అర్జీలను తక్షణం పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌కు 201 వినతులు


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను మనసు పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీఆర్ఓ పద్మజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి ప్రతి ఫిర్యాదును మనసు పెట్టి పరిష్కరించాలన్నారు. మండల పరిధిలో శాఖల సమన్వయ లోపం వల్లే జిల్లా కేంద్రానికి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, డివిజనల్, మండల స్థాయి సిబ్బందితో సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన అర్జీని కూడా చదవలేని స్థితిలో కొంతమంది అధికారులు ఉన్నారని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. వానాకాలంలో వచ్చే వ్యాధులపై దృష్టి సారించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. తాను తనిఖీలు నిర్వహించిన ప్రాంతాల్లో పారిశుధ్య లోపాలున్నట్లు గమనించానని పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని చెత్తను డంప్ యార్డులకు తరలించాలని ఆదేశించారు. పరిపాలనకు సంబంధించిన అన్ని దస్త్రాలు ఈ ఆఫీస్ ద్వారానే సర్క్యులేట్ కావాలన్నారు. 102 లోకాయుక్త కేసులు, 150 హైకోర్టు కేసులు ఏఏ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత వివరాలన్నింటినీ వచ్చే సోమవారానికి సిద్ధం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలతో పాటు ఓఆర్‌హెచ్ఎస్ ట్యాంకులను శుభ్రం చేసి తగు మోతాదులో క్లోరినేట్ చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేసిన తేదీలు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సమగ్ర నివేదికలను 3 రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద 6వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 90 శాతానికి పైగా రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయని, మండల సర్వేయర్లు, వీఆర్వోలపై అత్యధికంగా ఫిర్యాదులు రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 201 మంది అర్జీదారుల నుంచి వినతులు అందాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

రోగుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు


నూతన క్యాజువాలిటీలో సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డితో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కొత్తగా విస్తరించిన ఏఎంసీ, క్యాజువాలిటీ, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఓపీ కౌంటర్‌లను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం 4 గంటల తర్వాత క్యాజువాలిటీకి ఎక్కువ మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారని, ఈ కారణంగా కొన్నిసార్లు ఒక్కో పడకపై ఇద్దరేసి రోగులకు చికిత్స అందించాల్సి వస్తోందన్నారు. సమస్యపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు 20 పడకలతో నూతన క్యాజువాలిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానిటర్లు, ఆక్సిజన్ పైప్‌లైన్లు, నాలుగు పడకలకు వెంటిలేటర్లను కూడా అమర్చినట్లు చెప్పారు. అలాగే మరో 12 పడకలతో ఏఎంసీని పూర్వ బ్లడ్‌బ్యాంకు స్థానంలో విస్తరించామన్నారు. వీటికి అవసరమైన వెంటిలేటర్లు, మానిటర్లను పూర్వ వైద్య విద్యార్థి డాక్టర్ రంగారెడ్డి విరాళంగా ఇస్తున్నారని చెప్పారు. అవసరమైతే మరిన్ని పడకలు, వెంటిలేటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డి, ఈఎండీ హెచ్ఓడీ డాక్టర్ రామశివనాయక్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు ఇక్బాల్‌అహ్మద్, లక్ష్మీబాయి, రాజశేఖర్, విద్యాసాగర్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ఆర్ఎంఓ వెంకటరమణ, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల సెక్యూరిటీ సూపర్‌వైజర్ సుమిత్ర పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వివరాలు.. గురుకులంలో విద్యార్థినులచే చెత్త తొలగింపు పనులు చేపట్టడంతో ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విద్యార్థులతో పనిచేయిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పలువురు నెటిజన్లు వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేశారు. వీడియోలు వైరల్ కావడంపై ప్రిన్సిపాల్ గీత.. స్కూల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సుమిత్రను మందలించింది. ఆమె మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ గీతను ఫోన్‌లో సంప్రదించగా.. తాను సోమవారం స్కూల్‌కు వెళ్లలేదని, విధుల పట్ల అలసత్వం వహిస్తే అడగడం తప్పా అన్నారు. బాలికల పాఠశాల కావడంతో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు చెప్పారు.

ఆ బంగారం ఏమైంది?

- హెచ్‌సీ నిర్వాకంపై ఓ స్టేషన్‌లో అంతర్గత చర్చలు

కర్నూలు: కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో రికవరీ చేసిన 5 తులాల బంగారం ఏమైందని స్టేషన్‌లో సిబ్బంది మధ్య అంతర్గత చర్చలు జరుగుతున్నాయి. తుగ్గలి మండలం రాంపల్లె గ్రామానికి చెందిన బోయ రంగస్వామి, కృష్ణగిరి మండలం ఎరుకలి చెరువు గ్రామానికి చెందిన బోయ వెంకటరాముడు బావ, బామ్మర్దులు. వీరు గత నెల చివరి వారంలో(జూన్ 26, 27) కర్నూలు షరాఫ్ బజార్‌లో బంగారు నగలు కరిగిస్తుండగా ఒక హెడ్ కానిస్టేబుల్ కనుగొని దొంగలుగా అనుమానించి స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. విచారణ పేరుతో దాదాపు మూడు రోజుల పాటు స్టేషన్‌లో పెట్టుకున్నారు. దీంతో వారిని విడిపించుకునేందుకు ఎరుకలిచెరువు గ్రామానికి చెందిన జీన నాగరాజు.. వెంకటరాముడు తరఫున, రంగస్వామి తరఫున ఆయన బంధువులు కలసి కర్నూలుకు వచ్చి రూ.లక్ష నగదు చెల్లిస్తాం.. వదిలేయాలని కోరారు. అయితే కేసు నమోదు చేయకుండా ఐదు తులాల బంగారు నగలు నొక్కేసి నిందితులుగా అనుమానించిన రంగస్వామి, వెంకటరాముడులను వదిలేశారు. అవినీతి ఆరోపణలపై ఇటీవల ఆరుగురు పోలీస్ సిబ్బందిని నూతన ఎస్పీ అలిగేషన్ డీఓపై జిల్లా సరిహద్దు ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా ఆ హెడ్ కానిస్టేబుల్ కూడా బదిలీ కావడంతో ఇప్పుడు ఆ స్టేషన్‌లో నొక్కేసిన బంగారం ఏమైందనే విషయమై సిబ్బందిలో చర్చనీయాంశమైంది. ఎస్‌హెచ్ఓకు ఈ వ్యవహారం జరిగే తెలిసిందా? లేక ఆ హెడ్ కానిస్టేబులే బంగారం నొక్కేసి నిందితులుగా అనుమానించిన వారిని వదిలేశాడా? అనే విషయమై వెలుగులోకి రావాల్సి ఉంది. గతంలో 108 కిలోల బంగారం, నగలు వాహన తనిఖీల్లో పట్టుబడితే బాధితులకు వాపసు ఇవ్వకుండా కొంతకాలం తర్వాత స్టేషన్ సిబ్బందే నొక్కేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా జైలుపాలయ్యారు. ఇప్పుడు రికవరీ బంగారాన్ని ఓ హెడ్ కానిస్టేబుల్ నొక్కేసిన ఘటన చర్చకు తావిస్తోంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బిందు మాధవ్ రికవరీ బంగారం మాయంపై విచారణ జరిపితే మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

దొంగను బంధించిన స్థానికులు


దొంగ లోపల ఉండగా ఇంటికి తాళం వేసిన దృశ్యం

కోసిగి: చోరీ చేసేందుకు ఇంట్లోకి దూరిన దొంగను స్థానిక ప్రజలే బంధించి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం రాత్రి కోసిగిలో చోటుచేసుకుంది. వివరాలు.. కోసిగిలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న తోవి వెంకటేష్, కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కర్ణాటక రాష్ట్రం కొల్హాపూర్‌కు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి మెయిన్ గేటు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంటి మరో తలుపు తాళం పగలకొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఇంటి పక్కనే నివశిస్తున్న అన్నదమ్ములకు శబ్దం రావడంతో లేచి చూశారు. ఇంటి లోపల ఒక దొంగ ఉండగా మరో దొంగ బయట వేచి ఉన్నాడు. వారు దగ్గరకు వెళ్లే సరికి బయట ఉన్న వ్యక్తి పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన అన్నదమ్ములు లోపల ఉన్న దొంగ బయటకు రాకుండా తలుపు మూసి తాళం వేశారు. వారు గట్టిగా అరవడంతో కాలనీవాసులు గుమిగూడారు. పట్టుబడిన వ్యక్తి కోసిగిలోని 9వ వార్డు కాలనీకి చెందిన భీమయ్యగా గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించి నిందితుడిని అప్పగించారు. ఎస్ఐ సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి దొంగల ముఠా ఆటకట్టిస్తామని ఎస్ఐ స్పష్టం చేశారు.

హత్యకేసు దర్యాప్తు ముమ్మరం


హత్య జరిగిన ప్రదేశంలో పోలీసుల పరిశీలన (ఫైల్)

పాములపాడు: ఈ నెల 19న రాత్రి మండల కేంద్రంలో ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి చిన్న లింగస్వామి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య కేసు ఛేదన అతి త్వరలో తేలనుందని పోలీసులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలువురిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడి ఫోన్ కాల్ లిస్టు ద్వారా నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. అనుమానితుల నుంచి కొంత సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక వ్యక్తుల సహకారంతోనే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తూ ఆకోణంలో కూడా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి అప్పు చెల్లించాల్సిన వారే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని బంధువులు భావిస్తునారు. అయితే వివాహేతర సంబంధం కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. మృతుడి ద్విచక్ర వాహనంలో లభించిన నిమ్మకాయలు, టెంకాయ, కుంకుమ, పసుపు ఉండటంతో ఏదైనా తాంత్రిక పూజల కోసం ఫోన్ చేసి బయటకు రప్పించి పథకం ప్రకారం హత్య చేశారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే దాదాపు 70 శాతం పురోగతి సాధించినట్లు సమాచారం.